దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : వివేకనంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజెస్ (రామకృష్ణ మఠం) జూన్–ఆగస్టుకు సబంధించిన లాంగ్వేజెస్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైనీస్, ఫ్రెంచ్, జర్మనీ, జపనీస్, స్పానిష్‌తో పాటు హిందీ, సంస్కృతం, స్పోకెన్ ఇంగ్లిష్ భాషలు నేర్చుకోవాలనుకునే వారు.. మే 10 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 96035 78545 నంబర్‌లో వాట్సాప్ ద్వారా సంప్రదించాలని కోరారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు స్త్రీశక్తి -2025 సమ్మిట్

సిటీబ్యూరో, ఏప్రిల్14(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ పోలీస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్త్రీసమ్మిట్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మహిళల భద్రత అంశాన్ని ప్రధానంగా తీసుకుని ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని హోటల్ తాజ్‌డెక్కన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కహాజరవుతారన్నారు. ఇందులో ప్రధానంగా మహిళలు, పిల్లలు భద్రతతో పాటు అర్బన్ ఎన్విరాన్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఎమర్జెన్సీ ప్రిపేర్డ్‌నెస్ తదితర అంశాలపై చర్చా కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ఆహ్వానితులు, ప్రభుత్వ అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిష్ణాతులైన మహిళలు 500 మంది పాల్గొంటారని కమిషనర్ పేర్కొన్నారు.

నామినేషన్ల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 14: గత 50 ఏళ్లుగా ఎక్సలెన్సీ అవార్డులను అందజేసి పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తున్న తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) 2025 సంవత్సరానికి గాను 21 విభాగాలలో నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షులు డాక్టర్ సురేష్ కుమార్ సింఘాల్ తెలిపారు. రెడ్ హిల్స్‌లో గల ఫ్యాప్సీ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవార్డు కమిటీ ఛైర్మన్ రమాకాంత్ ఇనానీ, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్, కమిటీ ఛైర్ శ్రీనివాస్ గరిమెళ్ళ, ప్రేమ్‌చంద్ కంకారియా తదితరులతో కలిసి ఎక్సలెన్సీ అవార్డుల బ్రోచర్‌ను సురేష్ కుమార్ సింఘాల్ ఆవిష్కరించారు. నాణ్యమైన ఉత్పత్తి, ఆవిష్కరణలు, స్థిరమైన వృద్ధి, రాష్ట్ర జీడీపీకి గణనీయమైన సహకారం అందించిన సంస్థలకు ఈ అవార్డులను అందజేస్తామని ఆయన అన్నారు. అవార్డుల ఎంపికకు జ్యూరీ కమిటీలో జస్టిస్ చల్లా కోదండరామ్, ఎం. గోపాల కృష్ణ, అజయ్ మిశ్రా, బి.పి ఆచార్య, ప్రొఫెసర్ ఉదయ్ బి. దేశాయ్ సభ్యులుగా ఉన్నారన్నారు. ఈ ఏడాది 700కు పైగా ఎంట్రీలు వస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 91210 00199, 80087 00257 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

న్యాక్‌లో ముగిసిన జాతీయ సదస్సు

కాచిగూడ, ఏప్రిల్ 14: తెలంగాణ రోడ్లు, భవనాల విభాగం, ఇండియన్ బిల్డింగ్స్ కాంగ్రెస్(ఐబీసీ) రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మిత పర్యావరణంలో ఆవిష్కరణలు అనే అంశంపై మిడ్ టర్న్ సెషన్ (ఎంటిఎస్) జాతీయ సదస్సు నగరంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)లో నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 400 ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి చివరి రోజు సోమవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆర్ అండ్ బి వికాస్ రాజ్ ఐఏఎస్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఐబీసీ జాతీయ అధ్యక్షురాలు ఇంజనీర్ చిన్మయి దేబ్నాథ్, ఐబీసీ తెలంగాణ చాప్టర్ చీఫ్ ప్యాట్రాన్, ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, చాప్టర్ చైర్మన్ ఇంజనీర్ పి.సూర్య ప్రకాష్, గౌరవ కార్యదర్శి సత్యనారాయణ, ఇంజనీర్ గౌతమ్ పాల్గొన్నారు.

వాయిదాల పేరిట కాలయాపన

- నత్తనడకన చెరువుల హద్దుల నిర్ధారణ
- హైకోర్టు పర్యవేక్షణలోనూ అదే అలసత్వం
- హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- ప్రతీసారి వాయిదా కోరుతున్న వైనం
- హైకోర్టు మొట్టికాయలతో ఫైనల్ నోటిఫికేషన్ జారీ

కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు

సిటీబ్యూరో, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో హైకోర్టు చెరువులను పర్యవేక్షిస్తున్నా... హద్దుల నిర్ధారణ ఆశించినంత వేగంగా ముందుకు సాగడం లేదు. హెచ్ఎండీ పరిధిలోని చెరువుల హద్దుల నిర్ధారణపై గతంలో విచారించిన హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 30లోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. అయితే నెలవారీ వాయిదాలతో హద్దుల నిర్ధారణ ప్రక్రియలో హెచ్ఎండీఏ కాలయాపన చేస్తూ వస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 2,936 చెరువులు ఉన్నాయని, 1,889 చెరువులకు ఇప్పటి వరకు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయగా, మిగిలిన 1,047 చెరువులకు సంబంధించి పూర్తి స్థాయి హద్దులను నిర్ధారిస్తూ తాజాగా తుది నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే గడిచిన నాలుగు నెలలుగా ఈ ప్రక్రియను సాగదీస్తున్న హెచ్ఎండీఏ... కోర్టుకు మూడు నెలల గడువు కోరినా హద్దుల నిర్ధారణ అంశాన్ని తుది దశకు తీసుకురాలేకపోయింది.

బఫర్, ఎఫ్‌టీఎల్‌పై నత్తనడకన సర్వే..

వాస్తవానికి చెరువుల బఫర్, ఎఫ్‌టీఎల్‌పై గత కొంత కాలంగా హెచ్ఎండీఏ సర్వే చేపడుతూనే ఉంది. నత్తనడకన సాగుతున్న హద్దుల నిర్ధారణతో ఇప్పటికే ఎనిమిది నెలలు సమయం గడిచిపోయింది. అయితే ఇప్పటి వరకు హెచ్ఎండీఏ హద్దుల నిర్ధారణ ప్రక్రియను పూర్తి చేయలేదు. ఈ క్రమంలో ఇకతామే చెరువుల హద్దుల నిర్ధారణను పర్యవేక్షిస్తామని హైకోర్టు స్పష్టం చేసినా... హెచ్ఎండీ నెలవారీ వాయిదాలతో కాలం గడుపుతోంది. ఓవైపు అక్రమ నిర్మాలంటూ హైడ్రా, ఇతర శాఖల అధికారులు చెరువుల సమీపంలో ఉండే నివాసితులను భయభ్రాంతులకు గురి చేస్తుంటే.. హద్దుల నిర్ధారణ చేయడంలో ప్రభుత్వం, హెచ్ఎండీ తీవ్ర జాప్యం చేస్తోంది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ పరిధిలో చెరువులకు బఫర్, ఎఫ్టీఎల్ జోన్లను నిర్ధారిస్తూ... ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే మరోసారి గడువు కోరినా... హైకోర్టు స్పందించకపోవడంతో... ప్రభుత్వానికి చెంపపెట్టులా మారింది.

నెలవారీ వాయిదాలు..

చెరువుల హద్దుల నిర్ధారణపై నివేదిక ఇచ్చేందుకు తొలుత గతేడాది ఆగస్టు నెలాఖరు నుంచి నవంబర్ వరకుహెచ్ఎండీఏ గడువు కోరింది. గడువులోపు పూర్తిచేయకపోవడంతో మరోసారి డిసెంబర్ నెలాఖరులోగా హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులకు హద్దులను పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా... హెచ్ఎండీఏ నుంచి స్పందన కరువైంది. ఈ క్రమంలోనే మరో నెల రోజుల వ్యవధి కోరిన హెచ్ఎండీఏ ఆలోపు చెరువుల హద్దుల నిర్ధారణ పూర్తిచేస్తామని స్పష్టం చేసింది. కానీ ఏప్రిల్ 15 దాటిన ఇప్పటివరకు చెరవుల హద్దుల నిర్ధారణలో ఆశించిన పురోగతి లేదనేది స్పష్టం అవుతోంది. ఈ క్రమంలో హైకోర్టు పర్యవేక్షిస్తున్నా... పనుల్లో పురోగతి లేకపోవడంతో వచ్చే విచారణ సమయానికి ప్రోగ్రెస్ రిపోర్టును ఏ విధంగా అందజేస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇలా గడిచిన ఏడాది కాలంగా హద్దుల నిర్ధారణకు హెచ్ఎండీఏ, సర్కార్ వాయిదాలు కోరుతూనే ఉన్నాయి.

శాఖల మధ్య సమన్వయ లోపం..!

నిజానికి చెరువుల హద్దుల నిర్ధారణ మూడు శాఖల పరిధిలో ఉంటుంది. రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ శాఖలు ఒకేతాటిపైకి వస్తే గానీ నగరంలో చెరువుల హద్దుల నిర్ధారణ పూర్తిచేసే అవకాశం లేదు. ఇప్పటికే ఈ మూడు శాఖల మధ్య నెలకొని ఉన్న సమన్వయ లోపంతో చెరువు భూములకు రక్షణ లేకుండా చేసిందనే విమర్శలున్నాయి. ఇప్పటికీ వందలాది చెరువులు కబ్జాకోరల్లో ఉన్నా... సంబంధిత మూడు శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ క్రమంలో హైకోర్టు మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేస్తే తప్ప ప్రభుత్వంలో, అధికారుల్లో చలనం వచ్చేలా లేదు.

ఇండ్లపైకి బుల్డోజర్లను ఎగదోస్తున్న సర్కార్

హెచ్ఎండీఏ లేక్స్ విభాగం ఆలసత్వమో, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమో నగరంలో చెరువులకు హద్దుల నిర్ధారణ పూర్తి కావడం లేదు. చెరువులను పూర్వ వైభవం తీసుకువస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ సర్కార్... జలవనరుల ఆక్రమణల పేరిట పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను ఎగదోస్తుంది. అయితే చెరువుల హద్దులను తేల్చే విషయాన్ని మాత్రం గాలికి వదిలేసిందనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వం చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా ఆక్రమణలకు తావులేకుండా చెరువుల బ్యూటిఫికేషన్, కాలుష్య రహిత చర్యలకు ప్రాధాన్యతనిస్తూ హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పలు చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దింది. కానీ తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ చేసిన చెరువుల అభివృద్ధిని తప్పుబట్టినట్లుగా... హైడ్రాను ఏర్పాటు చేసి.. కూల్చివేతలకు దిగిందే తప్పా... చెరువుల హద్దుల నిర్ధారణను పూర్తి చేయలేకపోయింది.

ముగిసిన సంపూర్ణ శతావధానం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 14: శతావధాని డా మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ మూడు రోజుల సంపూర్ణ శతావధానం సోమవారంతో ముగిసింది. అవధాని 75పద్యాలను ధారణ చేసి సాహితీ రసజ్ఞులను అబ్బురపరచి ఆనందింప జేశారు. ఈ ధారణా సభ సాహితీ వేత్త డా.మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి అధ్యక్షతన జరిగింది. శతావధాని డా.మారేపల్లి వెంకట రమణ పట్వర్ధన్ 5వ శతావధానం ధారణ అనంతరం విజయోత్సవ సభ నేత్రపర్వంగా సాగింది.. ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు, స భాధ్యక్షులుగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి వ్యవహరించగా విశిష్ట అతిథులుగా శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి ,తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానంద రావు,బీజేపీ నాయకురాలు కొత్తూరు గీతా మూర్తి, ఆచార్య కోట్ల హనుమంత రావు, వనం జ్వాలా నరసింహారావు పాల్గొన్నారు..శతావధాని పట్వర్ధన్‌ను "విద్యుమణి" బిరుదుతో సన్మానించారు. అవధాన చరిత్రలో అపురూపంగా నిలిచిపోయేల అవధాన నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు డా.కేవీ రమణాచారి,అధ్యక్షులు నారుమంచి వేంకట అనంత కృష్ణ.కార్యదర్శి మరుమాముల దత్తాత్రేయ శర్మ,ఉపాధ్యక్షులు ఆముదాల మురళి,ప్రచార కార్యదర్శి మారుమాముల వెంకటరమణ శర్మ,కోశాధికారి కేవీఎన్ ఆచార్య,సభ్యులు అద్భుత నిర్వహణకు కృషిచేశారని వక్తలు ప్రశంసించారు.

మారేపల్లి వెంకటరణ పట్వాధన్ ను సన్మానించిన నిర్వాహకులు

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి 'లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ' అవార్డు

సిటీబ్యూరో, ఏప్రిల్14, (నమస్తే తెలంగాణ): ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డీ నాగేశ్వరరెడ్డి మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. జపాన్‌లో నిర్వహించిన "టోక్యో లైవ్ గ్లోబల్ ఎండోస్కోపీ 2025" కార్యక్రమంలో గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన "లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ" అవార్డును ఆయన అందుకున్నారు. షోవా యూనివర్సిటీ డైజెస్టివ్ డిసీజెస్ సెంటర్ చైర్మన్ డాక్టర్ హరుహిరో ఇనోయే అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డు పొందిన తొలి భారతీయ గ్యాస్ట్రోఎంటరాలజిస్టుగా నాగేశ్వరరెడ్డి నిలిచారు.

అవార్డు అందుకుంటున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైటెక్ సిటీలో విల్లా వర్డే గ్రాండ్ లాంచ్

సిటీ బ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): సైబర్ సిటీ బిల్డర్స్, డెవలపర్స్ సంస్థ వారు హైటెక్ సిటీలోని గ్రీన్ లాండ్స్ రోడ్డులో నిర్మించిన 'విల్లా వర్డే' విల్లాల ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఇక్కడ 300 నుంచి 440 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 89 విల్లాలను నిర్మించారు. అన్ని వసతులు కలిగిన ఒక్కో విల్లా రూ.13.4 కోట్లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. సైబర్ సిటీ బిల్డర్స్, డెవలపర్స్ సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ లగ్జరీ విల్లాలను కస్టమర్లకు అందజేశామని వారు తెలిపారు. సెలబ్రిటీలు, ప్రముఖ ఇంటీరియర్ డిజైనర్ సుసాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ చాంప్స్ రంగారెడ్డి, మేడ్చల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ సీనియర్ రగ్బీ టోర్నీలో రంగారెడ్డి(పురుషుల), మేడ్చల్(మహిళల) విజేలుగా నిలిచాయి. మేడ్చల్–మల్కాజిగిరి రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జింఖానా మైదానంలో జరిగిన టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల నుంచి 25 జట్లు పోటీపడ్డాయి. సోమవారం జరిగిన పురుషుల ఫైనల్లో రంగారెడ్డి 22–7 గోల్స్ తేడాతో నల్లగొండపై ఘన విజయం సాధించింది. మహిళల తుది పోరులో మేడ్చల్–మల్కాజిగిరి 27–0తో రంగారెడ్డిని చిత్తుగా ఓడించింది. పోటీల ముగింపు కార్యక్రమానికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర రగ్బీ సంఘం అధ్యక్షుడు నరేంద్రరామ్, ప్రధాన కార్యదర్శి ఆదిత్య..విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్, ఏప్రిల్ 14: ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బాలాపూర్ చౌరస్తా, మీర్పేట్ లో అంబేద్కర్ విగ్రహాలకు ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నియోజకవర్గం వ్యాప్తంగా పలుచోట్ల అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఇందిరా దేవి, బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతి , ఉద్యోగ సంఘాల నాయకులు పరమేష్, మహేష్, ఆంజనేయులు, చందర్ రావు, రాకేష్, యాదగిరి, ఎలీషా, శ్రీనివాస్, రాజేందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రామిరెడ్డి, జంగారెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో..: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ డాక్టర్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జలమండలి కార్యాలయంలో..: అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఈడీ మయాంక్ మిట్టల్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సమన్వయకర్త సీజీఎం పద్మజ, ఈఎన్‌సీ– ఆపరేషన్స్ –2 డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ –1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎంలు అబ్దుల్ ఖాదర్, ప్రభు, నాగేందర్, నారాయణ, సుజాత, జీఎంలు, జలమండలి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కార్యాలయంలో ..: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ స్ఫూర్తితో ముందుకు సాగాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కమిషనర్ ఇలంబర్తి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, వేణుగోపాల్, యాదగిరి రావు, సీఈ రత్నాకర్, ఏఎంసీ జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీడీసీఎల్‌లో..: అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం దక్షిణతెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్‌పీడీసీఎల్)లో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి డైరెక్టర్ సాయిబాబా, నందకుమార్, చీఫ్ ఇంజనీర్లు బాలస్వామి, ఆనంద్, ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ మజీదుల్లాఖాన్, సీవీఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ ఆసుపత్రిలో..: ఈఎన్టీ ఆసుపత్రిలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనందచారి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్ఎంఓ డాక్టర్ అనిల్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంపత్ కుమార్. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్, టీఎన్జీవో ఈఎన్‌టీ యూనిట్ అధ్యక్షులు తూముకుంట రాజు, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి రవి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కళా భవన్‌లో..: టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యోత్సవాలు బాగ్లింగంపల్లి లోని ఆర్టీసీ కళా భవన్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, రాజశేఖర్, వెంకన్న, జాయింట్ డైరెక్టర్ నర్మద, సీపీఎం ఉషాదేవి, రంగారెడ్డి ఆర్ఎం శ్రీలతతో పాటు ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల ఘన నివాళి..

ట్యాంక్‌బండ్ వద్ద నివాళులర్పిస్తున్న మందకృష్ణ మాదిగ

కవాడిగూడ, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పలువురు ప్రముఖులు, ప్రజాసంఘాలు, దళిత సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టివిక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీలు ఆచార్య కోదండరాం, అద్దంకి దయాకర్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, నాయకులు ఈ.టి.నరసింహ, సీపీఎం నాయకులు జాన్‌వెస్లీ, ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ మేయర్ కార్తీక రెడ్డి,సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ, అంజన్‌కుమార్ యాదవ్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుకరాజు తదితర ప్రజా సంఘం, దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

27న వైశ్య అచీవర్స్ అవార్డ్స్



వైశ్య అచీవర్స్ 2025 లోగోను నిర్వాహకులకుతో కలిసి ఆవిష్కరిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంతి విహారి తదితరులు

మాదాపూర్, ఏప్రిల్ 14: నిజ జీవిత హీరోలు, స్ఫూర్తిదాయక వ్యక్తులు, భవిష్యత్ తరానికి మార్గదర్శకులైన వారిని గుర్తించి వైశ్య అచీవర్స్ అవార్డ్స్–20 25 కార్యక్రమాన్ని ఈనెల 27న రిసార్ట్ గండిపేటలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. సోమవారం మాదాపూర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్ విహారి విచ్చేసి వైశ్య అచీవర్స్ అవార్డ్స్–2025 లోగోను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా విద్యా, వైద్య, సినిమా, క్రీడలు, వ్యాపారం, టెక్నాలజీ, ఇన్నోవేషన్ వంటి 18 విభిన్న విభాగాలకు చెందిన రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మార్గదర్శకులకు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్తు ఆవిష్కర్తగా (ఇన్నోవేటర్ ఆఫ్‌టుమారో) ప్రత్యేక జూరీ అవార్డును సైతం అందించనున్నట్లు తెలిపారు. లెగసి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, లైఫ్ సేవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, విశ్వకర్మ తదితర అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.

గిగ్ వర్కర్స్ ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో గిగ్ వర్కర్ల భద్రత కోసం ప్రభుత్వం చట్టం రూపొందించడానికి సిద్ధమైంది. బిల్లు ముసాయిదాపై కార్మిక నాయకులతో చర్చలు జరిగాయి. కాగా, ముసాయిదా ఆన్‌లైన్లో పెట్టి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించనున్నారు. ఈనెల 28న సాయంత్రం 5 గంటల లోపు వరకు వచ్చిన అభ్యంతరాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని కార్మిక శాఖాధికారులు తెలిపారు. అభ్యంతరాలను tg. gig. labour @ gmail. comకు మెయిల్ చేయొచ్చని తెలిపారు. 'సజెషన్స్ ఆన్ గిగ్ వర్కర్స్ బిల్లు' అనే శీర్షికన అభ్యంతరాలు, సూచనలను అందించవచ్చు. నేరుగా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ట్యాక్స్ భవన్‌లో లేబర్ కమిషనర్ కార్యాలయంలో అభ్యంతరాలను అందించవచ్చని పేర్కొన్నారు.



నెక్లెస్ రోడ్డులోని సర్కిల్ వద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ నాయకులు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు.